న్యాయసేవల్లో ఐలు సభ్యులు ముందుండాలి

తణుకురూరల్: కోర్టుకొచ్చే కక్షిదారులకు న్యాయసేవలందించడంలో ఐలు సభ్యులు ముందుండాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి, న్యాయవాది పుట్టా వేణుగోపాలచౌదరి అన్నారు. బుధవారం ఐలు తణుకు యూనిట్ మహాసభ ఎం.సత్యనారాయణాచార్యులు అధ్యక్షతన తణుకు బార్ అసోసియేషన్ హాల్లో జరిగింది. వేణుగోపాలచౌదరి మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి, కక్షిదారుల ప్రయోజనం కోసం ఐలు అలుపెరుగని పోరాటాలు చేసిందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా ఎం.సత్యనారాయణాచార్యులు, అధ్యక్షులుగా కౌరు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా కెవిఎల్ సత్యవతి, కార్యదర్శిగా ఎన్.సోమేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా చింతపల్లి నాగేశ్వరరావును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి కె.సత్యనారాయణమూర్తి, ఐలు జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి, కె.గిరిజ, డి.అప్పారావు, కె.పురుషోత్తం, బివివి విక్టర్‌బాబు పాల్గొన్నారు.

హైటెన్షన్

కాళ్ల మండలం ఏలూరుపాడు వద్ద యువగళం వాలంటీర్లను తరలిస్తున్న పోలీసు వాహనాలను అడ్డుకున్న టిడిపి నేతలు

- లోకేష్‌కు పోలీసులు నోటీసుల జారీ
- తీసుకునేందుకు లోకేష్ నిరాకరణ
- నోటీసు తీసుకున్న పాలకొల్లు ఎంఎల్‌ఎ రామానాయుడు
- యువగళం క్యాంపు సైట్లో అర్ధరాత్రి పోలీసులు హల్‌చల్
- 50 మంది వాలంటీర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 44 మంది యువగళం వాలంటీర్లు, 13 మంది టిడిపి నేతలపై కేసుల నమోదు
- పోలీసుల తీరుపై టిడిపి నేతల ఆగ్రహం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం పరిసర ప్రాంతాల్లో బుధవారం హైటెన్షన్ నెలకొంది. మంగళవారం రాత్రి భీమవరం శివార్లలో తాడేరు టౌన్‌షిప్ వద్ద టిడిపి, వైసిపి పరస్పర దాడితో పరిస్థితులు ఉద్రిక్తతకు దారితీశాయి. మంగళవారం అర్ధరాత్రి పోలీసులు పెద్దసంఖ్యలో యువగళం క్యాంపు సైటుకు చేరుకుని సుమారు 50 మంది వాలంటీర్లను అదుపులోకి తీసుకున్నారు. దీంతో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. బుధవారం ఉదయం ఎనిమిది గంటలకే లోకేష్ పాదయాత్ర ప్రారంభించాల్సి ఉన్నప్పటికీ బాగా ఆలస్యమైంది. పాదయాత్ర ప్రారంభించేందుకు బస శిబిరం నుంచి లోకేష్ బయటకు రాగానే పోలీసులు అడ్డుకున్నారు. భీమవరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించడంతోపాటు ముఖ్యమంత్రి జగన్, స్థానిక ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌పై రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారని, పాదయాత్ర కాన్వాయ్‌లో ఎక్కువ వాహనాలు ఉన్నాయని, రాత్రి సమయం దాటినా పాదయాత్ర జరిగిందనే అంశాలపై వివరణివ్వాలని భీమవరం రూరల్ సిఐ నాగప్రసాద్ లోకేష్‌కు, టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మికి నోటీసులిచ్చే ప్రయత్నం చేశారు. దీనిపై లోకేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పోలీసులపై ప్రశ్నల వర్షం కురిపించారు. శాంతిభద్రతలకు వైసిపి మూకలు విఘాతం కలిగించలేదా అని లోకేష్ నిలదీశారు. నాకు ఇస్తున్న నోటీసులు వైసిపి వాళ్లకు ఇచ్చారా అని ప్రశ్నించారు. దాడి చేసిన వారిని వదిలేసి బాధితులుగా ఉన్న తమకు నోటీసులు జారీ చేయడం సరికాదని లోకేష్ నోటీసు తీసుకునేందుకు నిరాకరించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ క్రమంలో లోకేష్, సీతారామలక్ష్మి తరపున ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు భీమవరం రూరల్ సిఐ నాగప్రసాద్ నుంచి నోటీసులు అందుకున్నారు. అనంతరం పాదయాత్ర ముందుకు సాగింది. ఉదయం 8 గంటలకు భీమవరం రూరల్ మండలం కె.బేతపూడి క్యాంపు నుంచి ప్రారంభం కావాల్సిన పాదయాత్ర ఉత్కంఠ పరిణామాల మధ్య 11.30కు ప్రారంభమైంది. పాదయాత్రకు దారిపొడవునా ఘనస్వాగతం లభించింది. పెదగరువు మీదుగా వెంప మెయిన్ సెంటర్ వరకూ సాగిన పాదయాత్ర భోజన విరామం తర్వాత లోకేష్ క్షత్రియ సామాజిక తరగతి ప్రతినిధులతో సమావేశమయ్యారు.

2800 కిలోమీటర్ల మైలురాయి శిలాఫలకం ఆవిష్కరణ

లోకేష్ యువగళం పాదయాత్ర చేపట్టి 206 రోజుల్లో 2,800 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వెంప సెంటర్లో 2800 కిలోమీటర్ల మైలురాయి శిలాఫలకాన్ని లోకేష్ ఆవిష్కరించారు. అక్కడ నుంచి సాగిన పాదయాత్ర నరసాపురం నియోజకవర్గంలోకి ప్రవేశించింది.

మొగల్తూరు: శేరేపాలెంలో స్థానికులతో మాట్లాడారు. నక్కవారి పాలెంలో ఎస్‌సి సామాజిక తరగతికి చెందిన వారితో లోకేష్ సమావేశమయ్యారు. ఎన్‌టిఆర్ గొల్లగూడెంలో స్థానికులతో మాట్లాడి మొగల్తూరు గాంధీ సెంటర్ మీదుగా స్మార్ట్ పాయింట్‌కు చేరుకుని కాపు సామాజిక తరగతికి చెందిన వారితో లోకేష్ భేటీ అయ్యారు. అక్కడి నుంచి యాత్ర మొగల్తూరు అంబేద్కర్ విగ్రహం సెంటర్ మీదుగా జోరువర్షంలో పాదయాత్ర సీతారామపురంలోని విడిది కేంద్రం వరకూ సాగింది.

పాదయాత్రలో నారా లోకేష్

సభలో మాట్లాడుతున్న లోకేష్

పేద క్షత్రియులకు చేయూతనిస్తాం : లోకేష్

ప్రజాశక్తి - భీమవరం

టిడిపి అధికారంలోకి వచ్చిన 100 రోజులలో క్షత్రియుల అభివద్ధికి నిధులు కేటాయించి పేద క్షత్రియులు చేయూతనిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టుకు విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పేరు నామకరణం చేస్తామని హామీ ఇచ్చారు. యువ గళం పాదయాత్రలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నియోజకవర్గం వెంప గ్రామంలో ఏర్పాటు చేసిన క్షత్రియ సామాజిక తరగతి ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. లోకేష్ అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్షత్రియులు అనేక సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకొచ్చారు. తమలోనూ పేదలున్నారని, కార్పొరేషన్ ఏర్పాటుచేసి ఆదుకోవాలని కోరారు. చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు తన 1800 ఎకరాలను విద్యాసంస్థలకు దానం చేశారని గుర్తు చేశారు. ఆయన మరణానంతరం తగిన గౌరవం ప్రభుత్వాల నుంచి దక్కలేదన్నారు. ఆయన పేరున స్మారక భవనం ఏర్పాటు చేయాలని కోరారు. ఆక్వాకు సంబంధించిన స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటుకు రాయితీలు, ప్రోత్సాహం కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన లోకేష్ మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే పేద క్షత్రియులకు చేయూతనందిస్తామన్నారు, భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెడతామని, అమరావతిలో అల్లూరి మెమోరియల్ ఏర్పాటుచేస్తామని, పార్లమెంటులో కూడా అల్లూరి విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మూర్తిరాజు స్వగ్రామంలో మూర్తిరాజు విగ్రహం, స్మారక భవనం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎపిని సైకో జగన్ మరో బీహార్‌గా మార్చేశారని విమర్శించారు. నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజును ఏం చేశారో మీకు తెలుసని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు, తణుకు మాజీ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ, మాజీ ఎంఎల్‌సి పాందువ్వ శ్రీను, జెడ్‌పి మాజీ ఛైర్మన్ ముళ్లపూడి బాపిరాజు పాల్గొన్నారు.

యువగళం క్యాంపు సైట్‌లో అర్ధరాత్రి పోలీసులు హల్‌చల్

భీమవరం రూరల్, కాళ్ల : బేతపూడి యువగళం క్యాంపు సైట్‌లో మంగళవారం అర్ధరాత్రి పోలీసులు హల్‌చల్ చేశారు. మూడు వ్యాన్లలో క్యాంపు వద్దకు చేరుకున్న పోలీసులు క్యాంపును చుట్టుముట్టి వాలంటీర్లపై దురుసుగా ప్రవర్తించారు. వాలంటీర్లు, కిచెన్ సిబ్బంది, క్యాంపు ఏర్పాటు చేసే సిబ్బంది మొత్తం 50 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని కాళ్ల మండలం సీసలి రాజ్యలక్ష్మి మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ వద్దకు తరలించారు. ఈ విషయం బుధవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో తెలియగానే టిడిపి నేతలు అక్కడికి చేరుకుని వాలంటీర్లను ప్రయివేటు భవనంలో నిర్బంధించడం ఏమిటని నిలదీశారు. సుమారు గంట అనంతరం మధ్యాహ్నం 12 గంటలు దాటాక వారిని అక్కడ నుంచి కాళ్ల పోలీసు స్టేషన్ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ నుంచి ఆకివీడు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆకివీడు నుంచి వేరే పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా టిడిపి నాయకులు పోలీస్‌స్టేషన్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. దీంతో వాలంటీర్లను భీమవరం పోలీసు స్టేషన్‌కు తరలించారు.

టిడిపికి చెందిన 57 మందిపై కేసుల నమోదు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరం శివారు తాడేరు టౌన్‌షిప్ వద్ద వైసిపి, టిడిపి పరస్పర దాడులకు సంబంధించి టిడిపికి చెందిన 56 మందిపై భీమవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. లోకేష్ యువగళం పాదయాత్రలో మంగళవారం రాత్రి తాడేరు టౌన్‌షిప్ వద్ద వైసిపి, టిడిపి శ్రేణులు పరస్పర దాడికి దిగిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి దాయం బెంజిమెన్, మల్లు మణికంఠ, మైలాబత్తుల మహేష్ ఫిర్యాదు మేరకు 44 మంది యువగళం కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర అధికార ప్రతినిధి కోళ్ల నాగేశ్వరరావు, దెందులూరు మాజీ ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్, టిడిపి నేతలు కౌరు పృధ్వీశంకర్, చిలుకూరి రామకృష్ణచౌదరి, ధర్మేంద్ర, కడిమి సూర్యనారాయణ, వీరవల్లి చంద్రశేఖర్, మద్దుల రాము, ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, కడలి వాసు, కల్లేపల్లి శ్రీను, కవురు భాస్కరరావు మొత్తం 13 మందిపై కూడా కేసు నమోదు చేశారు. ప్రకాశం చౌక్‌లో ఫ్లెక్సీ చించారని వైసిపి నేత తోట భోగయ్య ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేశారు. అలాగే గాయాలైన పోలీసుల్లో ఒకరైన కాళ్ల పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ దొంగ రమేష్ ఫిర్యాదు మేరకు మరో కేసు నమోదు చేశారు. అలాగే టిడిపి మండలాధ్యక్షుడు కౌరు పధ్వీ తనపై కొందరు దాడి చేశారని చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్న యువగళం కార్యకర్తలకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వన్‌టౌన్, టుటౌన్ సిఐలు అడబాల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్ పర్యవేక్షణలో వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టుకు తరలించారు.

యువగళం వాలంటీర్లకు టిడిపి నేతల పరామర్శ

పోలీసుల అదుపులో ఉన్న యువగళం కార్యకర్తలను స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద మాజీ మంత్రులు దేవినేని ఉమ, కొల్లు రవీంద్ర పరామర్శించారు.

లోకేష్ యాత్రలో రక్తకాండ : మంత్రి కొట్టు

తాడేపల్లిగూడెం : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర రక్తకాండను సృష్టిస్తోందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. బుధవారం మంత్రి తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. లోకేష్ తన పాదయాత్రలో రౌడీలను వెంటబెట్టుకొని రౌడీయిజం చేస్తున్నాడన్నారు. పాదయాత్రలో సెక్యూరిటీగా పోలీసులను పెడితే లోకేష్ తన మనుషులను పెట్టి కొట్టిస్తున్నాడన్నారు. లోకేష్ వెనుక ఉన్న టీమ్ అందరి ట్రాక్ రికార్డు తనిఖీ చేసి, నేర చరిత్ర కలిగిన వారిని గుర్తించాలని ఎస్‌పికి మంత్రి సూచించారు.

దాడులకు ఉసిగొల్పిన లోకేష్‌పై కేసు పెట్టాలి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు: భీమవరంలో దాడులకు ఉసిగొల్పిన లోకేష్‌పై కేసు పెట్టాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసాంఘిక శక్తులను తన చుట్టూ పెట్టుకొని లోకేష్ దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. ఐటి నోటీసులు ఇచ్చారనే ఆందోళనలో తండ్రీ కొడుకులు ప్రజలపైనే దాడులు చేస్తున్నారని విమర్శించారు. ఎంఎల్‌ఎ గ్రంధిని బూతులు తిడుతూ రెచ్చగొట్టే విధంగా వ్యవహరించి ఫ్లెక్సీలు చించివేసి కావాలనే వివాదం సృష్టించారన్నారు. ఇటువంటి దాడులకు భయపడే ప్రసక్తే లేదన్నారు.

ఓర్వలేకే వైసిపి దాడులు

ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు

భీమవరం రూరల్ : యువగళం పాదయాత్ర ప్రజాగళంగా మారడాన్ని జీర్ణించుకోలేక జగన్మోహన్‌రెడ్డి, వైసిపి మూకలు ఓర్వలేక దాడులు చేస్తున్నారని పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు విమర్శించారు. బేతపూడి యువగళం క్యాంపు వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేష్‌కు పోలీసులు ఇచ్చిన రూట్‌లో పాదయాత్ర చేస్తే అక్కడ వైసిపి మూకలను పోలీసులు ఎందుకు అనుమతించారని ప్రశ్నించారు. సిఎం సభలు, సమావేశాలకు టిడిపి జెండాలతో తాము వెళితే పోలీసులు ఊరుకుంటారా అని ప్రశ్నించారు. పాదయాత్ర మధ్యలోకి వైసిపి జెండాలతో వచ్చి లోకేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తుంటే పోలీసులు ఎందుకు అనుమతించారన్నారు. సిఎం సభలు, పర్యటనలు ఉంటే టిడిపి నేతలను హౌస్ అరెస్టులు, 30 యాక్టు అంటూ నిర్బంధించే పోలీసులు మంగళవారం రాత్రి జరిగిన ఘటనకు ఏం సమాధానం చెబుతారన్నారు. వైసిపి అరాచకవాదులు అలజడి సృష్టించబోతున్నారని ఎస్‌పి, డిఎస్‌పికి తాము సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. లోకేష్‌పై దాడిని ప్రతిఘటించిన వాలంటీర్లను అర్ధరాత్రి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ పోలీసుల నిర్లక్ష్యం, ఏకపక్ష వైఖరితోనే పాదయాత్రపై వైసిపి మూకలు దాడి చేశారన్నారు. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ వైసిపి మూకల దాడిలో మాజీ ఎంఎల్‌ఎ శివరామరాజు గాయాల పాలయ్యారన్నారు. అరెస్టు చేసిన వాలంటీర్లను తక్షణం విడుదల చేయాలని, లేకుంటే పోలీస్ స్టేషన్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. శ్రీను అనే సిఐ వైసిపి గూండాలను దగ్గరుండి ప్రోత్సహించారని ఆరోపించారు.

కందిపప్పు కనుమరుగు..!

- కుచించుకుపోయిన రేషన్ సరుకులు
- ఈ నెల బియ్యం, పంచదారతో సరి
- దాదాపు తొమ్మిది సరుకుల నుంచి రెండుకు కుదింపు
- వంటనూనె, శనగలు వంటి వాటికీ తిలోదకాలు
- బహిరంగ మార్కెట్లో మండిపోతున్న నిత్యావసరాల ధరలు
- లబోదిబోమంటున్న సామాన్య ప్రజానీకం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందించే సరుకులన్నీ రోజురోజుకీ తగ్గిపోతున్నాయి. కందిపప్పు దాదాపు కనుమరుగవుతున్న పరిస్థితి నెలకొంది. సెప్టెంబర్‌లో అందించే రేషన్ సరుకుల్లో బియ్యం, పంచదారతో సరిపెట్టేశారు. ఒకప్పుడు తొమ్మిది నుంచి పది సరుకులు రేషన్ దుకాణాల్లో అందించేవారు. ఇప్పుడు బియ్యం మాత్రమే నికరంగా ఇస్తున్నారు. కొన్ని నెలలు మాత్రమే పంచదార వంటివి అందిస్తున్నారు. ఒకపక్క పెరిగిన ధరలు, మరోపక్క రేషన్ సరుకుల్లో కోతతో సామాన్య ప్రజానీకం పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 11 లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. రేషన్ బియ్యం, సరుకులపై ఆధారపడి జీవించే కుటుంబాలు అత్యధికంగానే ఉన్నాయి. రాష్ట్ర విభజనకు ముందు రేషన్ దుకాణాల్లో తొమ్మిది సరుకులు ఒక సంచిలో పెట్టి అందించేవారు. బియ్యం, వంటనూనె, గోధుమలు, కందిపప్పు, పంచదార, శనగపప్పు, కిరోసిన్, ఎండుమిర్చి వంటివి సైతం ఇచ్చేవారు. 2014 తర్వాత వంటనూనె, బియ్యం, పంచదార, గోధుమలు వంటి కొన్ని సరుకులు మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. నికరంగా బియ్యం మాత్రమే ఇస్తున్నారు. మరికొన్ని నెలలు పంచదార ఇస్తున్నారు. కందిపప్పు ఎప్పుడో గుర్తొచ్చినప్పుడు అన్నట్లు పరిస్థితి తయారైంది. అప్పుడప్పుడు ఇచ్చినా అవి కూడా సరైన నాణ్యత లేని పరిస్థితి ఉంది. బహిరంగ మార్కెట్లో వంటనూనె ధర రూ.150కుపైనే పలుకుతోంది. కందిపప్పు ధర పరిస్థితి అదేవిధంగా ఉంది. నిత్యావసర వస్తువుల ధరలన్నీ ఆకాశాన్నంటాయి. కరోనా తర్వాత సామాన్య ప్రజానీకం ఆర్థిక పరిస్థితి తారుమారైంది. వ్యవసాయ కూలీలకు పనులు లేకుండాపోయాయి. చిరుద్యోగులు ఉపాధి కోల్పోయి రోడ్డునపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యునికి అందనంత ఎత్తుకు ఎగబాకాయి. లీటర్ పెట్రోల్ రూ.115కు చేరింది. డీజిల్ సెంచరీ కొట్టింది. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోవడంతో హోటళ్లలో టిఫిన్ ధర రూ.40కు భోజనం ఖరీదు రూ.వంద నుంచి రూ.120కి చేరింది. ఇటువంటి పరిస్థితుల్లో పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు దాటవేత ధోరణికి దిగాయి. సబ్సిడీపై రేషన్ సరుకులు అందించి ఆదుకోకపోగా.. ఉన్నవి సైతం ఎగ్గొడుతున్న పరిస్థితి నెలకొంది. బహిరంగ మార్కెట్లో కందిపప్పు కొనుగోలు చేయాలంటే రూ.130కుపైనే ఉంది. సబ్సిడీపై రేషన్ ద్వారా అందించే కందిపప్పు ఇవ్వకపోవడంతో సామాన్య ప్రజానీకం బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేషన్ సరుకుల కుదింపుపై తీవ్ర విమర్శలు గుప్పించిన వైసిపి అధికారంలోకొచ్చాక మరింత కుదించిన పరిస్థితి నెలకొందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంటింటికీ రేషన్ అందించేందుకు రెండు జిల్లాల్లోనూ 750 వాహనాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. బియ్యం, పంచదార ఇవ్వడానికి ఇంత పెద్దమొత్తంలో ఖర్చు పెట్టి వాహనాలు ఏర్పాటు చేయడం ఎందుకనే విమర్శలు విన్పిస్తున్నాయి. రేషన్ దుకాణల్లో సబ్సిడీపై గతంలో మాదిరిగా సరుకులు అందించాలని సామాన్య ప్రజానీకం కోరుతున్నారు. ప్రభుత్వంలో మాత్రం చలనం లేకుండాపోయింది. ముందుముందు బియ్యం కూడా అందిస్తారా.. లేదా అనే అనుమానాలు నెలకొన్నాయి.

పలుచోట్ల వర్షం.. రోడ్లు జలమయం

ప్రజలు, వాహనదారుల అవస్థలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారిపై వర్షపు నిలిచిపోవడందో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక రహదారిపై నిలిచిపోయింది. మొగల్తూరు నుంచి శేరేపాలెం, కొత్తకాయలుతిప్ప, పేరుపాలెం, వారతిప్ప, వెంప, మొగల్తూరులోని వెలిదివారివీధి, ముక్కువారివీధి, హై స్కూల్ రోడ్డు, పలు గ్రామాల్లోని రహదారులపై వర్షపు నీరు నిలిచిపోయింది.

పాలకొల్లు : పాలకొల్లు పరిసర ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి వాతావరణం చల్లగా మారి చలిగాలులు వీచాయి. ఉదయం చినుకులు పడ్డాయి. సాయంత్రం వరకు వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది. సాయంత్రం ఆకస్మికంగా భారీ వర్షం పడింది. వివాహ, శుభ కార్యాలు ఉన్న నేపథ్యంలో ప్రజలు పలు ఇబ్బందులకు గురయ్యారు.

మొగల్తూరులో జలమయమైన రోడ్డు

పెనుమంట్ర : అల్పపీడనం కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఉదయం నుంచి అడపాదడపా చిరు జల్లులు కురుస్తున్నాయి. తెల్లవారుజామున మూడు గంటల నుంచి ఉదయం ఐదు గంటల వరకు పొలమూరు, పెనుమంట్ర, మాముడూరు, మార్టేరు, ఆలమూరు, భట్లమాగుటూరు, ఓడూరు, నెలమూరు, వెలగలేరు, నెగ్గిపూడి గ్రామాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి. బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో పెళ్లిళ్ల వంటి శుభ కార్యక్రమాలు జరుగుతున్న సందర్భంలో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

ఒపిఎస్ అమలయ్యేవరకూ పోరాటం

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

మాట్లాడుతున్న గోపీమూర్తి

ప్రజాశక్తి - పెనుమంట్ర

సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తానని సిఎం జగన్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని నెరవేర్చేవరకూ పోరాటం చేస్తామని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను సంరక్షించే విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనుబాబు అధ్యక్షతన మార్టేరు డివిజన్ సమావేశం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం హాజరయ్యారు. గోపీమూర్తి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పాఠశాలల విలీనం చేయడంతో వేలాది పాఠశాలలు మూత పడుతు న్నాయన్నారు. దీంతో ప్రభుత్వ విద్యారంగం తీవ్ర సంక్షోభానికి గురవుతుం దని, బడి ఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమవుతున్నారని చెప్పారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేస్తానని ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. ఒపిఎస్ అమలు చేసేవరకూ పోరాటం చేస్తామని తెలిపారు.

డాక్టర్ సుబ్బారావుకు సిపిఎం నేతల పరామర్శ

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట గ్రామానికి చెందిన రిటైర్డ్ సైంటిస్ట్, స్మేక్ వ్యవస్థాపకులు, కోపరేటివ్ సొసైటీ మాజీ ఉపాధ్యక్షులు డాక్టర్ చిలుకూరి సుబ్బారావు భార్య సత్యవతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. డాక్టర్ సుబ్బారావును సిపిఎం మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం మండల కమిటీ సభ్యులు, వద్దిపర్తి అంజిబాబు, ఎస్‌విఎన్.శర్మ, పి.మోహన్‌రావు, జ్యోతి గ్యాస్ యాజమాన్యం, నెక్కంటి వేణుగోపాలకృష్ణ బుధవారం పరామర్శించారు.

డాక్టర్ సుబ్బారావును పరామర్శిస్తున్న సిపిఎం మాజీ ఎంఎల్‌ఎ రాజగోపాల్

నేడు సత్యవతి సంతాప సభ

ఈ నెల ఏడో తేదీ స్థానిక మృత్యుంజయ సొసైటీ కార్యాలయం వద్ద ఉదయం పది గంటలకు సంతాప సభ నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వీరవాసరం రెల్లి కాలనీలో డెంగీ కలకలం..!



విజయవాడ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రామస్వామి

ప్రజాశక్తి - వీరవాసరం

తెల్లవారేసరికి గ్రామాలను శుభ్రం చేసి ప్రజలు ఎటువంటి వ్యాధులకు గురి కాకుండా అపారిశుధ్య పరిస్థితులను తొలగించే పారిశుధ్య కార్మికులు విషజ్వరాల బారిన పడితే పట్టించుకునే ప్రభుత్వం, వైద్యాధికారులే కరువయ్యారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులను సైతం ఎదుర్కొని ఎప్పుడు ఆరోగ్యవంతులుగా ఉండే పారిశుధ్య కార్మికులకు విషజ్వరాలు సోకడంతో విలవిల్లాడిపోతున్నారు. పనిలోకి వెళ్లకపోతే పూట గడవని స్థితిలో పారిశుధ్య కార్మికుల కుటుంబానికి చెందిన పలువురు విషజ్వరాల బారిన పడి ప్రాణాలు నిలబెట్టుకునేందుకు రూ.లక్షలు అప్పు చేసి ప్రయివేట్ వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితిని ఎదుర్కొంటున్నారు. వీరవాసరం రెల్లి కులస్తులు నివసించే కాలనీలో కొన్నిరోజులుగా డెంగీ విష జ్వరాలు సోకడంతో ప్రయివేట్ ఆసుపత్రిలో వైద్యం పొందుతున్నారు. ధనాల సీతమ్మ అనే వృద్ధురాలు, కొప్పుల భవాని, కొప్పుల రామస్వామి విషజ్వరాలతో విజయవాడ, భీమవరం ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వీరిలో కొప్పుల రామస్వామి 24 రోజులుగా విజయవాడలో వైద్యం చేయించుకుంటూ ఇప్పటివరకు రూ.నాలుగు లక్షల వరకు అప్పు చేసినట్లు బంధువులు తెలిపారు. తమ కాలనీవాసులుకు విషజ్వరాలు సోకడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆరోగ్యం కేంద్రంపై ఆధిపత్య పోరుపై ఉన్న శ్రద్ధ వారి విధులు నిర్వర్తించడంలో లేదని బహిరంగంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. వచ్చామా వెళ్లామా అనే ధోరణిలో వీరి వైఖరి ఉండటంతో వారి పని తీరు పట్ల సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతుంది. జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలోనే ఇటువంటి పరిస్థితులు కొనసాగితే మిగిలిన ఆరోగ్యం కేంద్రాల్లో సిబ్బంది పని తీరు ఏ విధంగా ఉంటుందో ఉన్నతాధికారులే తేల్చాల్సి ఉంది. ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నా కేవలం రికార్డుల పరిశీలనతో సరిపెడుతున్నారు. పరిస్థితులు ఏమిటన్నది క్షేత్రస్థాయిలో పరిశీలించడంలేదు. ఇదే అవకాశంగా తీసుకుని స్థానిక వైద్య సిబ్బంది ఇష్టానురీతిలో వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందిపై దృష్టి పెట్టి సక్రమంగా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

భీమవరంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీతమ్మ

వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

రూ.లక్షలు పోసి ప్రయివేటు వైద్యం

అప్పుల పాలవుతున్న పేదలు

నిత్యావసరాల ధరలు తగ్గించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి - పెంటపాడు

నిత్యావసర ధరలు తగ్గించాలని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రజా సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యాన పరిమళ్ల సచివాలయంలో జాయింట్ సెక్రటరీ జిఆర్ఎస్‌పి.లక్ష్మికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు చిర్ల పుల్లారెడ్డి, మరపట్ల దానయ్య మాట్లాడుతూ మోడీ అధికారంలోకొచ్చాక నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గ, గాది వెంకట్రావు, అద్దంకి లక్ష్మయ్య, గంగరాజు, తాడి ప్రసాద్, గిద్ద భద్రరావు, తాడి అంజి, రాంబాబు, శివ, సాధనాల ప్రసాద్, రాము పాల్గొన్నారు.

మేకా శేషుబాబుకు స్వాగతం పలుకుతున్న వైసిపి నేతలు

టిటిడి సభ్యులు మేకా శేషుబాబుకు ఘనస్వాగతం

ప్రజాశక్తి - పాలకొల్లు, పాలకొల్లు రూరల్

టిటిడి సభ్యులుగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత తొలిసారిగా పాలకొల్లు వచ్చిన మేకా శేషుబాబుకు ఘనస్వాగతం లభించింది. పూలపల్లి వై.జంక్షన్ నుంచి భారీ మోటార్ సైకిళ్లపై ఆయన అనుయాయులు, వైసిపి కార్యకర్తలు పట్టణంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా ఆయనకు ప్రజలు, వ్యాపారులు బ్రహ్మరథం పట్టారు. ఆయనతో పాటు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపి, జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవిందరాజులు, కార్పొరేషన్ ఛైర్మన్ వీరన్న, గుబ్బల రామకృష్ణ పాల్గొన్నారు.

పాలకొల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా వెంకటరమణ

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా విన్నకోట వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా ఎంఎన్‌వి.సాంబశివరావు బుధవారం భాద్యతలు చేపట్టారు. కోశాధికారిగా తోట రాంబాబు ఉన్నారు. పాలకొల్లు ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో ప్రస్తుత అధ్యక్షుడు కెవిఎస్‌ఎల్‌ఎన్.రాజు అధ్యక్షతన బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐజెయు సభ్యులు ముత్యాల శ్రీనివాస్, ఎపియుడబ్ల్యూజె జిల్లా ఉపాధ్యక్షులు పిటి.వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ సమావేశంలో సీనియర్ జర్నలిస్టులు మండెల అప్పలరాజు, వీరా సత్యం, మానాపురం సత్యనారాయణ, కాగిత సూర్య నారాయణ, పడాల గోపి, తమ్మినీడి మురళి, శాంతారావు, రాపాక రవి, బండి శ్రీనివాస్, కర్రా నాయుడు, సుధాకర్ పాల్గొన్నారు.

పాత్రికేయులకు సన్మానం

పాలకొల్లు : సమాజంలో సమస్యలు తెలుసుకుంటూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న వారు జర్నలిస్టులని వాసవి క్లబ్ అధ్యక్షులు రాజేష్ చెప్పారు. వాసవి క్లబ్ ప్రతి ఏడాది సెప్టెంబర్ ఆరో తేదీని జర్నలిస్ట్ డేగా గుర్తించింది. ఈ మేరకు బుధవారం ప్రెస్‌క్లబ్ సభ్యులను ఘనంగా సత్కరించారు. నారిజలిల్లీ బ్యూటీ పార్లర్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పిటి.వెంకటేశ్వరరావు, మండెల అప్పలరాజు, మానాపురం సత్యనారాయణలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి పలివెల శివ, కోశాధికారి చవ్వా సతీష్, రేపాక ప్రవీణ్, కామేశ్వరరావు, పేర్ల రాము పాల్గొన్నారు.

సెలవు రోజుల్లో స్కూళ్లు తెరిస్తే చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.సుందర్ డిమాండ్ చేశారు. పాలకొల్లులో బుధవారం తరగతులు నిర్వహిస్తున్న శశి స్కూల్, దిగమర్రు, జూనియర్ కళాశాల, మాంటిస్సోరి స్కూల్, ఛాంబర్స్ జూనియర్ కాలేజీ, సరస్వతి శిశు మందిర్ హైస్కూల్‌లను ఎఐఎస్ఎఫ్ నాయకులు మూయించారు. ఈ సందర్భంగా సుందర్ మాట్లాడుతూ సెలవు రోజుల్లో పాలకొల్లులో వివిధ ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు యధావిధిగా నడుస్తుంటే విద్యా శాఖాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే వాటిని మూయించే పని తాము తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు ఆర్.మణిదీప్, వై.సంతోష్, రాజా, టి.రాంప్రసాద్ వై.శ్యాంబాబు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి కిషోర్ కుమార్

'ఆశీర్వదించండి' వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఆచంట

రాష్ట్రంలో ప్రజల ఆశీస్సులతో పరిపాలనను కొత్తపుంతలు తొక్కించి విప్లవాత్మక నిర్ణయాలతో నూతన ఒరవడికి సిఎం జగన్ శ్రీకారం చుట్టారని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ అన్నారు. తొలుత ఆశీర్వదించండి కార్యక్రమం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆచంటలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కిషోర్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేసి పాలనను ప్రజల ముంగిట్లోకి తెచ్చారన్నారు. 56 బిసి కార్పొరేషన్‌లతో అట్టడుగు వర్గాలకు అత్యున్నత స్థానాలు కల్పించారన్నారు. మహిళలకు రాజ్యాంగబద్ధ పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. ఇవన్నీ చూసి సహించలేని ప్రతిపక్షాలు అనేక రకాల విమర్శలతో విషప్రచారాలు చేస్తున్నాయన్నారు. దానిని తిప్పికొట్టడానికి పార్టీ కార్యకర్తలు ఒక టీమ్‌గా ఏర్పడి నియోజకవర్గంలోని 53 గ్రామాల్లో స్థానిక నాయకులతో కలిసి ఆశీర్వదించండి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. త్వరలోనే ప్రారంభించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఉల్లం జ్యోతి రామనుజం, తప్పెట్ల విజయకుమారి వెంకట్రావు, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దేవిరెడ్డి రాంబాబు, మండల లీగల్ సెల్ అధ్యక్షులు ఉమేష్, పార్టీ నాయకులు మనవర్తి విజయ్‌కుమార్, ముడకల నానిబాబు, అడ్డాల సూర్యప్రసాద్, రామకృష్ణ, అరుపల్లి సత్యనారాయణ, చామన శ్రీనివాస్, బండి పద్మమోహన్‌రావు, మవుడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

వ్యక్తి అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమరాజు ఇల్లింద్రపర్రుకు చెందిన కొనకళ్ల బాలాజీ (32) తాపీ పని చేస్తుండేవాడు. ఈ క్రమంలో ఈ నెల నాలుగో తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలాజీ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో అతని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మల్లిపూడి నుంచి జుత్తిగ వెళ్లే రోడ్డుపై బాలాజీ సైకిల్‌ను పోలీసులు గుర్తించారు. బుధవారం సాయంత్రం మాముడూరు లాకుల వద్ద మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించి బాలాజీ తండ్రికి సమచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

డ్రెయినేజీ నిర్మించరూ..!

పాటిగరువువాసుల వేడుకోలు

ఎక్కడికక్కడే నిలిచిపోతున్న మురుగునీరు

విజృంభిస్తున్న దోమలు, రోగాల బారిన ప్రజలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని తిల్లపూడి పంచాయతీలోని పాటిగరువులో డ్రెయినేజీలు లేక అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరు నెలల క్రితం డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు పంచాయతీ వార్డు మెంబర్ దిడ్ల మాణిక్యాలరావు తెలిపారు. అయితే అవి మధ్యలో అసంపూర్తిగా నిలిచిపోయాయి. కొంతదూరం డ్రెయినేజీ నిర్మించినా అందులో నాణ్యత లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుందని స్థానికులు చెబుతున్నారు. విద్యుత్ స్తంభాలను తొలగించకుండా మధ్యలోనే ఉంచి డ్రెయినేజీ నిర్మించారు. దీంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయి మురికికాలువలను తలపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మధ్యలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయడానికి భగ్గేశ్వరం మెయిన్ డ్రెయిన్‌లో కలపడానికి ప్రయత్నించారు. కొంతమేర తవ్వి వాటిని పూడ్చకుండా వదిలేశారు. దీంతో రోడ్డుపై ప్రయాణించడానికి నానా అవస్థలు పడుతున్నామని రైతులు వాపోతున్నారు. ఆ రోడ్డు మీదుగా రైతులు, ఆక్వా రైతులు ఎరువులు, మేత బస్తాలు, వ్యవసాయ సామగ్రిని తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయని రైతులు వాపోతున్నారు. పలుమార్లు అధికారులకు వివరించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడి నీరు అక్కడే నిలిచి మురికి కూపాలుగా తయ్యారవ్వడంతో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయని, దీంతో రోగాల బారిన పడుతున్నామని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు డ్రెయినేజీలు నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని, ఆరోగ్యాన్ని కాపాడాలని స్థానికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

పూడ్చకుండా వదిలేసిన గొయ్యి

మురుగు కాలువను తలపిస్తున్న నిలిచిపోయిన నీరు

అందుబాటులోకి రానున్న జగనన్న ఆరోగ్య సురక్ష

ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మాలకొండయ్య

ప్రజాశక్తి - భీమవరం

రానున్న రోజుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అందుబాటులోకి తీసుకురానున్నట్లు ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూనం మాలకొండయ్య తెలిపారు. మండలంలోని వెలగపూడి సచివాలయం నుంచి ఆయన వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఎంటి.కృష్ణబాబుతో కలిసి సంయుక్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విధివిధానాలపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాలకొండయ్య మాట్లాడుతూ పౌరుల్లో ఆరోగ్య అవగాహన కల్పించడం, వారి ఆరోగ్య అవసరాలను ప్రచార పద్ధతిలో పరిష్కరించడం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమన్నారు. ఈ నెల 15న లాంఛనంగా ప్రారంభమవుతుందని, 30 నుంచి ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డి.మహేశ్వరరావు, ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్.సూర్యనారాయణ, ఐసిడిఎస్ పీడీ సుజా తరాణి, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, డిఇఒ ఆర్.వెంకటరమణ పాల్గొన్నారు.

రీ వెరిఫికేషన్ ప్రక్రియ బాధ్యతగా చేపట్టాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2024లో భాగంగా చేపడుతున్న రీ వెరిఫికేషన్ ప్రక్రియను బాధ్యతాయుతంగా చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ పి.ప్రశాంతి స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2024లో భాగంగా చేపడుతున్న రీ వెరిఫికేషన్ ప్రక్రియపై ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, ఎన్నికల సిబ్బందితో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు 2022 జనవరి ఆరో తేదీ నుంచి 2023 ఆగస్టు తొమ్మిదో తేదీ వరకు వచ్చిన తొలగింపులను మరోసారి తిరిగి పరిశీలించాలన్నారు. బిఎల్‌ఒలు నూటికి నూరు శాతం తిరిగి పరిశీలన చేయాలన్నారు. రీ వెరిఫికేషన్‌లో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఇఆర్‌ఒలు వెయ్యి క్లయిమ్స్ పరిశీలించాలని, ప్రతి నియోజకవర్గానికి ఒక సీనియర్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించామని, ప్రత్యేక అధికారులు 500 క్లయిములు రీ వెరిఫికేషన్ చేయాలని, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రతి నియోజకవర్గానికి వంద క్లయిములు పరిశీలించాలని ఎన్నికల కమిషన్ నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం రీ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందని, ఈ నెల ఏడో తేదీ నాటికి రీ వెరిఫికేషన్ పూర్తవుతుందని తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరికీ ఓటు హక్కు తొలగించరాదని, అర్హులందరికీ ఓటు హక్కు కల్పించేలా రీ వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టాలని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలంతా ఉపయోగించుకోవాలన్నారు. రీ వెరిఫికేషన్ ప్రక్రియను ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు, బిఎల్‌ఒల ద్వారా మానిటర్ చేస్తున్నామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా స్పెషల్ సమ్మరీ రివిజన్ - 2024లో భాగంగా జిల్లాలో ప్రతి నియోజకవర్గం, ప్రతి పోలీస్‌స్టేషన్ వారీగా రీ వెరిఫికేషన్ ప్రక్రియ చేపడుతున్నామన్నారు. ఆగస్టులో ఇంటింటికీ సర్వే పూర్తి చేసుకున్నామని, కొత్తగా ఎవరైతే 18 ఏళ్ల నిండినవారికి మొదటిసారి ఓటు హక్కు కల్పించడం, అర్హత ఉన్నవారు ఎక్కడైనా ఓటర్ నమోదు కాకపోయి ఉంటే వాళ్లందరినీ గుర్తించి బిఎల్‌ఒలు ఇంటింటికీ తిరిగి ఈ ప్రక్రియ గురించి వివరంగా తెలియజేయాలన్నారు. వారి వద్ద నుంచి ఫామ్-6 క్లయిమ్స్ తీసుకోవడం, ఎక్కడైనా చనిపోయిన, షిఫ్ట్ అయినా ఓటర్లు వారి వివరాలను ఫామ్-7లో తీసుకుని పూర్తిగా పరిశీలించి చనిపోయిన వారి ఓటు తొలగించడం, శాశ్వతంగా మైగ్రేట్, షిఫ్ట్ అయిన వారి వివరాలు, మార్పులు, సవరణలు ఫామ్-8 తీసుకుని చేసే ప్రక్రియలను పూర్తి చేసినట్లు తెలిపారు. బిఎల్‌ఒలు ఇంటింటికీ వెళ్లి మొత్తం ఓటర్ జాబితాను మరోసారి పరిశీలించి తీసుకున్న క్లయిమ్స్‌ను పరిశీలించి ఇఆర్‌ఒలు వారి లాగిన్‌ల నుంచి పరిశీలించి వాటన్నిటిని అప్రూవల్ చేసి వెంటనే డిస్పోస్ చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, ఇఆర్‌ఒలు, ఎలక్షన్ సూపరింటెండెంట్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంతి, జెసి రామ్‌సుందర్‌రెడ్డి

మండల స్థాయిలో గ్రీవెన్స్ డే

ప్రజాశక్తి - భీమవరం

ప్రతి బుధవారం, శుక్రవారం మండల స్థాయిలో గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమానికి అదనంగా మండల స్థాయిలో ప్రతి బుధ, శుక్రవారాల్లో గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల ఎనిమిదో తేదీ శుక్రవారం ఉదయం 10:30 గంటలకు యలమంచిలి మండలం నుంచి ప్రారంభించనున్నట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ప్రతివారం ఒక మండలంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఉదయం 10:30 గంటలకు ప్రారంభించనున్నట్లు చెప్పారు. మండలాల వారీగా ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి ప్రారంభమై నవంబర్ 15 వరకు మండల స్థాయి గ్రీవెన్స్ సెల్ కార్యక్రమం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులుతో కలిసి నిర్వహించనున్నట్లు తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేషనల్ బిల్డర్స్ అవార్డులు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో డాక్టర్ సబితా జూనియర్ కళాశాల ప్రాంగణం ఉల్లంపర్రులో నేషనల్ బిల్డర్స్ అవార్డులను బుధవారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాలకొల్లు మండల ఎడ్యుకేషన్ అధికారి గుమ్మల వీరాస్వామి పాల్గొన్నారు. నేషనల్ బిల్డర్స్ అవార్డులను సిహెచ్.పాండురంగప్రసాద్ (జిల్లా పరిషత్ హైస్కూల్ ఏనుగ వాని లంక), జి.లక్ష్మీనారాయణ (ఎంఎంకెఎన్‌ఎం హైస్కూల్ పాలకొల్లు), సిహెచ్.ప్రభావతి (ఎస్‌సిబిఎం స్కూల్ పాలకొల్లు), జివి.బ్రహ్మానందరావు (బిఆర్‌ఎంవి గర్ల్స్ హైస్కూల్ పాలకొల్లు)లకు అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ట్రెజరర్ ముత్యాల శ్రీవాత్సవ్, రోటరీ సభ్యులు మద్దాల వాసు, చందక రాము, పి.సత్యనారాయణ, రాంబాబు, రాము పాల్గొన్నారు.

టిడిపి ఫ్లెక్సీలు చింపేశారని ఫిర్యాదు

పాలకొల్లు రూరల్ : నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా మండలంలోని దిగమర్రు నుంచి చించినాడ వరకు కట్టిన అనేక ఫ్లెక్సీలను వైసిపివారు చింపేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పాలకొల్లు రూరల్ పోలీసులకు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, మామిడిశెట్టి పెద్దిరాజు, కోడి విజయభాస్కర్, దాసరి రత్నరాజు పాల్గొన్నారు.

'లోకేష్‌పై దాడి పిరికి చర్య'

భీమవరం రూరల్ : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై వైసిపి నేతల దాడి పరికిపందెల చర్య అని, ఇటువంటి దాడులు భీమవరంలో ఎప్పుడూ జరగలేదని, శాంతి భద్రతలను కాపాడాల్సిన పోలీసులు చోద్యం చూడటం సిగ్గు చేటని జనసేన నాయకులు వేగేశ్న కనకరాజు సూరి, మల్లినిడి తిరుమలరావు, ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగరాజు అన్నారు. జనసేన భీమవరం పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వైసిపి నేతలు అరాచక, గుండాయిజంతో భీమవరం ప్రజలను భయబ్రాంతులను చేస్తున్నారన్నారు. వైసిపి ఆగడాలకు, బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదన్నారు. ప్రజల పక్షనే ఉంటూ పోరాడతామని చెప్పారు.

నేను చేసిన అభివృద్ధి ప్రజలకు తెలుసు

నారా లోకేష్ వ్యాఖ్యలపై స్పందించిన ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భీమవరంలో తానే ఎంత అభివృద్ధి చేశానో ప్రజలకు తెలుసని స్థానిక ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సాయంత్రం జరిగిన యువగళం పాదయాత్ర బహిరంగ సభలో నారా లోకేష్ ఎంఎల్ఎ గ్రంధిపై చేసిన వ్యాఖ్యలకు, విమర్శలపై గ్రంధి స్పందించారు. బుధవారం ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడులు, అరాచకాలు చేయడం టిడిపికి అలవాటైం దన్నారు. రూ.52 కోట్లు దోచేశానని, వంద ఎకరాల భూమిని దందా చేశానని లోకేష్ తనపై విమర్శలు చేశారని, అవి ఎక్కడ ఉన్నాయో తనకు తెలియదని, ఆరోపణలు చేసినవారంతా చూపించాలని అన్నారు. 2004లో బైబిల్ చెరువు వద్ద 126 ఎకరాలు పేదల కోసం కొనుగోలు చేశామని, పట్టణ ప్రజల తాగునీటి సమస్య పరిష్కరించేందుకు 60 ఎకరాల్లో మంచినీటి చెరువు తవ్వామని తెలిపారు. భీమవరంలో పది బ్రిడ్జిలు నిర్మించామని, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, ఇళ్ల స్థలాలు అందించామని చెప్పారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్. నరసింహరాజు, ఎంపిపి పేరిచర్ల విజయనరసింహరాజు, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో మండలంలోని ఐదుగురు ఉత్తమ ఉపాధ్యాయులను మానవత సభ్యులు మంగళవారం రాత్రి ఘనంగా సన్మానించారు. మానవత అధ్యక్షులు బాణాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మార్టేరు గర్ల్స్ హైస్కూల్ ఉపాధ్యాయులు సిహెచ్.రామకృష్ణ, ఆలమూరు హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయులు కొనకళ్ల సుజాత, పెనుమంట్ర హైస్కూల్ ఉపాధ్యాయులు వర్దనపు ప్రభుదాస్, ఓడూరు స్కూల్ ఉపాధ్యాయులు సత్తి విజయకుమారి, ఎస్.ఇల్లింద్రపర్రు స్కూల్ ఉపాధ్యాయులు తమనంపూడి వెంకటేశ్వరరెడ్డిలను మానవత జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహనరావు, కార్యదర్శి కొత్త సత్యనారాయణ మూర్తి, జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీసుభాషిణి, పోడూరు ఎంఇఒ జివి.సూర్యనారాయణ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మానవత మండల కార్యదర్శి బండి ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ కర్రి కృష్ణరెడ్డి, జాయింట్ సెక్రటరీ దొంగ జయదుర్గారావు, ఛైర్మన్ చిర్ల సూర్యనారాయణరెడ్డి, ఆత్మీయ సహకార కమిటీ ఛైర్మన్ చిర్ల శ్రీనివాసరెడ్డి, మానవత సభ్యులు పడాల రామచంద్రారెడ్డి, పడాల జగన్నాథరెడ్డి, కోనాల నర్సిరెడ్డి, అల్లం భాస్కరరెడ్డి, ఎంపిటిసి సభ్యులు గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, మార్టేరు ఉప సర్పంచి కర్రి వేణుబాబు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మానవత సభ్యులు

ఆర్అండ్‌బి రహదారుల అభివృద్ధికి కృషి

ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - మొగల్తూరు

నరసాపురం నియోజకవర్గంలోని ఆర్అండ్‌బి రహదారుల అభివృద్ధికి రూ.80 కోట్ల నిధులు వెచ్చిస్తున్నామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కెపి.పాలెం నార్త్‌లో బుధవారం రూ.2.50 కోట్ల నిధులతో రహదారి అభివృద్ధి పనులకు ఆయన బుధవారం శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొగల్తూరు నుంచి కొండావారిపాలెం మీదుగా పాలకమ్మ చెరువు వరకు రహదారి పనులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. మొగల్తూరు మండలంలో ఎనిమిది రహదారులు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కొత్తకాయలతిప్పకు గ్రామానికి చెందిన మహిళలు తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రసాదరాజును కోరారు. గ్రామాల్లో సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, సర్పంచి కడలి సోంబాబు, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, కర్రి ఏసుబాబు, కొల్లాబత్తుల రవికుమార్, కందులపాటి ముత్యాలరావు, లక్కు బాలాజీ పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న చీఫ్ విప్

IN THE COURT OF THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, (II ADDNL. DISTRICT JUDGE) AT: KHAMMAM

M.A.T.O.P.NO 474 OF 2021

BETWEEN:-
Thulluri Narasimha Rao ...Claim Petitioner
AND
Bheemana NaniBabu & Others ... Respondents

To
Kesireddy Sruthi W/o. Satya Sai Manikanta, Age: major, Occ: Owner of the Lorry Bearing No. AP 37 TE-6009, R/o.H-No:8-82, Junction Road, Bheemadolu (Vill & Mandal), West Godavari Dt.

Take Notice that the above named Claim Petitioner have filed the above O.P. against the respondents claiming compensation. The above case is stands posted to **25-09-2023** for your appearance. Therefore, you are here by directed to appear before the Hon'ble court on **25-09-2023 at about 10-30 A.M.** in person or through an advocate without fail. Failing which the matter will be decided ex-parte against you.

//by order of the Hon'ble court //

05-09-2023
Khammam.

YEGINATI NAGESWAR RAO
Advocate, Khammam
CELL.98483 68823

ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - గణపవరం

మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించి జీతాలు పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ జిల్లా కార్యదర్శి సుంకర భవాని కోరారు. మండలంలోని పిప్పర గ్రామ సత్రంలో బుధవారం నిర్వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ల మండల యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కరువైందన్నారు. వారికి కనీస వేతనాలు కూడా ఇవ్వకుండా ప్రభుత్వం పని చేయించుకుంటుందన్నారు. ప్రభుత్వం వెంటనే కనీస వేతనాలు అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అనంతరం గణపవరం మండల యూనియన్ నూతన కార్యవర్గం ఏర్పడింది. మండల నూతన అధ్యక్షులుగా కె.రాముడు, ఉపాధ్యక్షులుగా ఎ.కనకదుర్గ, కార్యదర్శిగా ఐఎన్‌వి.జ్యోతి, జాయింట్ కార్యదర్శిగా వి.సత్యనారాయణ, కోశాధికారిగా పి.శ్రీనివాస్ ఎంపికయ్యారు.

పాలకొల్లులో అఖండ అన్నసమారాధన

ప్రజాశక్తి - పాలకొల్లు

కృష్ణాష్టమి సందర్భంగా పాలకొల్లు ఎర్రవంతెన వద్ద శ్రీకృష్ణుడి ఆలయంలో వైసిపి పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల గోపీ బుధవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అఖండ అన్నసమారాధనలో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నే శ్రీనివాస్, కార్యదర్శి భాస్కరరావు, కోశాధికారి ముగడ శ్రీనివాస్, చినిమిల్లి గణపతి, ఉనికిల శ్రీనివాస్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'నేడు జోడోకు సంఘీభావ యాత్ర'

ప్రజాశక్తి - ఉండి

ఎఐసిసి మాజీ అధ్యక్షులు, వయనాడ్ ఎంపీ రాహుల్‌గాంధీ జోడో యాత్ర చేసి సంవత్సరం పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మారేడు బాబ్జి ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీన తాడేపల్లిగూడెంలో నిర్వహించనున్న యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, పిసిసి జాయింట్ సెక్రటరీ వేగేశ్న వెంకట గోపాలకృష్ణరాజు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎఐసిసి, ఎపి పిసిసి సంయుక్త పిలుపు మేరకు తాడేపల్లిగూడెంలో యాత్రను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ యాత్రకు ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీ, టిటిడి మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు హాజరవుతారని పేర్కొన్నారు. ఉండి నియోజకవర్గానికి చెందిన పార్టీ మండల నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కోఆర్డినేటరు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

పశ్చిమ గోదావరి జిల్లా, పాలకొల్లు రాజీవ్ నగర్, వార్డ్ నెంబర్ 8 పసుపులేటి రమేష్, తండ్రి: పసుపులేటి గెడ్డయ్య, డో.నెం.45ఎ-3-3/ఎ అను నేను ది.31-08-2023న ఒరిజినల్ లింకు దస్తావేజులు బ్యాగ్‌ను నా మోటార్ సైకిల్ సైడ్ రింగుకి తగిలించుకొని పాలకొల్లు నుండి భీమవరం వస్తుండగా ఒరిజినల్ అయిన నా లింకు దస్తావేజులు నెం. 2287/1997 పాత బస్టాండు సమీపంలో పడిపోయినవి. దొరికినవారు ఈ క్రింది నెంబర్‌కి తెలియజేయగలరు.

పసుపులేటి రమేష్
తండ్రి: పసుపులేటి గెడ్డయ్య
డో.నెం.45ఎ-3-3/ఎ, రాజీవ్ నగర్,
పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా,
ఆంధ్రప్రదేశ్. సెల్: 89190 14461

పదవ తరగతి ఒరిజినల్ మార్క్ లిస్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, ఆచంట మండలం, పెదమల్లం పంచాయతీ పరిధి ఆనగార్ల లంక గ్రామానికి చెందిన ఆకుమర్తి మహేంద్ర, తండ్రి: సత్యనారాయణకు చెందిన తమ పదవ తరగతి ఒరిజినల్ మార్క్ లిస్ట్ హాల్ టికెట్ నెంబర్ 1409126149, పదవ తరగతి రిజల్ట్ 2014, రెగ్యులర్ ఒరిజినల్ మార్క్ లిస్ట్ జిరాక్స్ నిమిత్తం ఆనగార్ల లంక నుంచి మోటార్ సైకిల్‌పై పెదమల్లం వస్తుండగా ఒరిజినల్ మార్క్ లిస్ట్ కలిగిన బ్యాగు మార్గ మధ్యలో పడిపోయింది. కావున ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కు తెలియపరచగలరు.

ఆకుమర్తి మహేంద్ర
తండ్రి: సత్యనారాయణ, డో.నెం.3-99/2,
ఆనగార్ల లంక, పెదమల్లం,
ఆచంట మండలం, పశ్చిమ గోదావరి జిల్లా,
ఆంధ్రప్రదేశ్, పిన్: 534269.
సెల్: 87907 87309

మహారాజశ్రీ విజయవాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు

I.A.No.307/2023 in O.S.No.1072/2015

Between:
Gaadi Gnana Sree and another ...Petitioners
And
Boddu Sudarsana and others ...Respondents

<u>జడ్జిమెంట్ డెటార్</u>
కొప్పాడ మహేష్, తండ్రి కె.టి.యస్.వి.ప్రసాద్, కేరాఫ్ పీడా సురేష్, డోర్ నెం:13-16-44, ప్రొప్రొల్లు వారి వీధి, గున్నిపూడి, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు దావాలోని <u>ప్రతివాది నెం:5</u> యొక్క హాజరు నిమిత్తం వాయిదా ది.22-09-2023వ తేదీన ఉన్నది. కావున ఆరోజు ఉదయం గం.10-30 ని॥లకు మీరు కానీ లేదా మీ న్యాయవాది ద్వారా కానీ పై కోర్టు నందు హాజరు కాగలరు. లేనిచో పరోక్షముగా తీర్మానించెదరు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు మేరకు)

వాయిదా తేది:22-09-2023
విజయవాడ,
ది.28-08-2023

ఇట్లు
చందు నాగరాజు,
పిటీషనర్స్ తరపు న్యాయవాది.
SREEJA APARTMENT, 6th ROAD,
SRINIVASA NAGAR BANK COLONY,
VIJAYAWADA-520008,
Cell No.9440327326